

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం

21 సెప్టెంబర్ 2025 పేజీలు : 08


## 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర'లో..
# 5 లక్షల మంది



నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :

జిల్లావ్యాప్తంగా శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా సుమారు 5 లక్షల మంది పాల్గొంటున్నట్టు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల పేర్కొన్నారు. శనివారం నెల్లూరు బీవీ నగర్‌లోని పార్క్‌లో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొని పార్కులో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గత 8 నెలల నుండి స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం విజయవంతంగా నెల్లూరులో నిర్వహిస్తున్నామన్నారు. ఈవారం ప్రత్యేకంగా గ్రీన్ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. మండలాలకు కేటాయించిన ప్రత్యేక అధికారులు మండల స్థాయిలో ఈరోజు స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొంటున్నారని తెలిపారు. నవంబర్ మాసంలో వర్షాలు రానున్న నేపథ్యంలో ఈనెల 17 నుండి అక్టోబర్ 2వ తేదీ వరకు స్వచ్ఛత సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. నగర పరిధిలో ఇంటింటి నుండి చెత్తను సేకరించడం జరుగుతుందని, అయితే ప్రజలు తమవంతులో భాగంగా తడి చెత్తను పొడి చెత్తను వేరు చేసి అందించాలన్నారు. తద్వారా తడి చెత్తను పొడి చెత్తను వేరు చేసే ప్రక్రియ సులభతరమవుతుందని ఆశాభావాన్ని వ్యక్తపరిచారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కే.కార్తీక్, నగరపాలక సంస్థ కమిషనర్ నందన్, హార్టికల్చర్ ఆఫీసర్ శ్రీనివాసరావు, నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆర్ఐఓ ఆధ్వర్యంలో స్థానిక డీకేడబ్ల్యు కాలేజీలో మొక్కలు నాటారు. మొక్కలు నాటిన అనంతరం విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు.




## ప్రజలందరూ
# అప్రమత్తంగా ఉండండి
### ఆర్డీఓ నాగ సంతోష్ అనూష

నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :



వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని నెల్లూరు ఆర్డీఓ నాగసంతోష్ అనూష సూచించారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ.. పెన్నానదిలో వర్షాల నేపథ్యంలో నీటి విడుదల సందర్భంగా 30 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారన్నారు. పెన్నానది ఒడ్డున ఉండే ప్రజలందరూ మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా సరే, చేపల వేటకు వెళ్లాలని ఆలోచిస్తే అది పెనుప్రమాదమని, సందర్శకులు కూడా ఆ నదీ పరివాహక ప్రాంతాలకు వెళ్ళవద్దని సూచించారు. తెలుగు గంగ, సంగం అధికారులతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకొని, ప్రజలను అప్రమత్తం చేసే చర్యలలో భాగంగా ఇప్పటికే నగరంలోనే కాకుండా, నెల్లూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రతి చోట ప్రజలకు అవగాహన కలిగించేలా ఆటో ప్రచారం, టాంటాం వేయించామని, అధికారులను కూడా ఆయా ప్రాంతాలలో విధులు ఏర్పాటు చేశామని, ప్రజలందరూ పూర్తిగా సహకరించి, నదీ ఒడ్డున ఉండే వారందరూ మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## ప్రతి ఒక్కరూ కనీసం
# ఒక మొక్కను నాటాలి
### జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ



నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :

ప్రతినెల మూడవ శనివారం నిర్వహించే 'స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర'లో భాగంగా 'గ్రీన్ ఏపీ' కార్యక్రమంలో జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయం ఆవరణలో జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్

-మిగతా 2లో

## త్వరలో దగదర్తి ఎయిర్‌పోర్ట్
# పనులు ప్రారంభం
### స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు



దగదర్తి విమానాశ్రయ ప్రాజెక్టు పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయని స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు తెలిపారు. శనివారం ఆయన కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాతో కలిసి దగదర్తి ఎయిర్‌పోర్ట్ భూములను పరిశీలించారు.

వివరాలు 02లో

## ప్రతిష్టాత్మకంగా
# స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర

- ప్రతినెల మూడో శనివారం నిర్వహించేలా దిశా నిర్దేశం చేసిన ప్రభుత్వం
- మంత్రి నారాయణ ఆదేశాల మేరకు నెల్లూరు సిటీ పరిధిలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం చేపట్టిన టీడీపీ శ్రేణులు, అధికారులు



నెల్లూరు అర్బన్/క్రైమ్, మేజర్‌న్యూస్ :

ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా నిర్వహించే స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి నెల్లూరు సిటీ నియోజకవర్గంలో విశేష స్పందన వచ్చింది. మంత్రి నారాయణ పిలుపుతో 28 డివిజన్లలో పసుపుదండు పారిశుధ్య

-మిగతా 2లో

# త్వరలో దగదర్తి ఎయిర్‌పోర్ట్ పనులు ప్రారంభం

## స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు



**దగదర్తి, మేజర్‌న్యూస్ :** దగదర్తి విమానాశ్రయ ప్రాజెక్టు పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయని స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు తెలిపారు. శనివారం ఆయన కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాతో కలిసి దగదర్తి ఎయిర్‌పోర్ట్ భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా కృష్ణబాబు మాట్లాడుతూ.. దగదర్తిలో సుమారు 1,370 ఎకరాల విస్తీర్ణంలో ఆధునిక విమానాశ్రయాన్ని అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే శంకుస్థాపన జరిగిందని, ఇటీవల ఆర్‌ఎఫ్పి ప్రక్రియను ప్రారంభించినట్లు వివరించారు. పబ్లిక్ ప్రైవేట్ పార్ట్నర్‌షిప్ మోడల్‌లో భోగాపురం విమానాశ్రయంలా ఇక్కడ కూడా ప్రైవేట్ ఆపరేటర్లతో భాగస్వామ్యం కల్పించనున్నామని చెప్పారు. నవంబర్‌లోగా దరఖాస్తులు ముగియనున్నాయని, డిసెంబర్ నాటికి తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని తెలిపారు. దగదర్తి ప్రాంతం పరిశ్రమల అభివృద్ధికి అనువైన స్థలమని, కృష్ణపట్నం, రామయ్యపట్నం, దుగ్గరాజపట్నం వంటి పోర్ట్‌లకు సమీపంలో ఉండటం వల్ల విమానాశ్రయానికి మంచి వాణిజ్య అవకాశాలు ఉన్నాయని కృష్ణబాబు గుర్తించారు. భవిష్యత్తులో ఇక్కడ మెగా షిప్‌బిల్డింగ్ క్లస్టర్, సౌర విద్యుత్ ప్రాజెక్టులు, బిపిసిఎల్ వంటి పరిశ్రమలు ఏర్పడే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. కావున ఈ విమానాశ్రయం ఆర్థికపరంగా వయబుల్‌గా మారుతుందని నమ్ముతున్నట్లు ఆయన వెల్లడించారు. అన్ని పనులు సజావుగా జరిగితే 2026 లో ప్రాజెక్టు పూర్తి స్థాయిలో ప్రారంభమవుతుందని అన్నారు. రెండేళ్లలో విమానాశ్రయం పూర్తవుతుందని ఆశిస్తున్నామని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల మాట్లాడుతూ.. విమానాశ్రయానికి సంబంధించిన భూసేకరణ దాదాపు పూర్తయిందని, త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి దూరదృష్టిని ప్రశంసిస్తూ సాధారణంగా ఐఏఎస్ అధికారులు చేసే స్థాయి పరిశోధన, డేటా సేకరణ పనులు ఎమ్మెల్యే స్వయంగా చేసి సిద్ధం చేశారు. కావలి అభివృద్ధి కోసం పూర్తి వివరాలతో ప్రణాళిక సిద్ధం చేశారు. దీనివల్ల ప్రభుత్వ అధికారుల పనులు సులభమయ్యాయని పేర్కొన్నారు. కావలి అభివృద్ధికి కీలకమైన ఈ దగదర్తి విమానాశ్రయం ప్రాజెక్టు పూర్తి అయితే, జిల్లా స్థాయిలోనే కాకుండా రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి విశేషంగా దోహదపడనుందన్నారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి పాలకమండలి ప్రమాణ స్వీకారం

## చైర్మన్‌గా ఒట్టూరు సురేంద్ర యాదవ్

**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు గ్రామదేవత శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం నూతన పాలకమండలి సభ్యులు శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. దేవస్థానం ఛైర్మన్‌గా ఒట్టూరు సురేంద్ర యాదవ్ బాధ్యతలు స్వీకరించారు. సభ్యులుగా అల్లం లక్ష్మి, తమ్మినేని వెంకట రత్నం నాయుడు, కొండా కోటేశ్వర రెడ్డి, గుద్దేటి చెంచయ్య, కుమార్ హరికుమార్, మన్నేపల్లి వెంకటలక్ష్మి ప్రసూన, ముమ్మిడి కుమార్, మిడతల మహాలక్ష్మి, పులికొలను చంద్రశేఖర్ (ఎక్స్ అఫీషియో మెంబర్) ఈ కార్యక్రమానికి నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ఛైర్మన్‌గా ఒట్టూరు



సురేంద్ర యాదవ్, పాలకమండలి సభ్యులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. ఉభయదాతలు, ఉభయకర్తలను గౌరవంగా చూడాలని ఆయన కోరారు. సాధారణ భక్తుల మనోభావాలు దెబ్బ తినకుండా కమిటీ సభ్యులు పనిచేయాలని, అమ్మవారి ఆశీస్సులు ఉంటేనే దేవస్థాన కమిటీ సభ్యులు అయ్యారని గుర్తు చేశారు. ఛైర్మన్ ఒట్టూరు సురేంద్ర యాదవ్ మాట్లాడుతూ.. నెల్లూరు గ్రామదేవత శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి భక్తుడిగా, ఆలయ అభివృద్ధికి శక్తికి మించి కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి సమక్షంలో నూతన పాలకమండలి సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారని ఆలయ కార్య నిర్వహణాధికారి వి.గిరికృష్ణ తెలిపారు.



# ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటాలి

(మొదటి పేజీ తరువాయి)

ఆనం అరుణమ్మ శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ.. ప్రకృతిని పరిరక్షించడం ప్రతి మనిషి బాధ్యత అన్నారు. ప్రభుత్వం చేపట్టిన 'గ్రీన్ ఏపీ' కార్యక్రమంలో భాగంగా హరిత విస్తీర్ణం పెంచి, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడటం లక్ష్యంగా చేసుకోవాలనిన్నారు. ప్రధానంగా రాష్ట్రంలోని అటవీ భూభాగాన్ని పెంచడం, నగరాలు, గ్రామాల్లో మొక్కలు నాటి హరిత వాతావరణాన్ని కల్పించడం, ప్రజల్లో పర్యావరణం పట్ల అవగాహన కల్పించడం వంటి విషయాలపై దృష్టి సారించాలని సూచించారు. ప్రతి ఏడాది లక్షలాది మొక్కలు నాటడం ద్వారా చెట్ల సంఖ్యను పెంచాలన్నారు. విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ ఉద్యోగులు తదితరులు ఇందులో ప్రధానంగా పాల్గొనాలన్నారు. క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాలు గ్రామస్థాయిలో అమలు చేయాలన్నారు. ఇది మన భవిష్యత్తు తరాలకు ఆరోగ్యవంతమైన భూమిని అందించేందుకు మార్గం సుగమం చేస్తుందని, మనందరం ఈ కార్యక్రమంలో భాగస్వాములై, ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్క నాటి దానికి పర్యవేక్షణ చేయడం మన బాధ్యత అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రజాపరిషత్ సీఈవో మోహన్‌రావు, ఆర్డబ్ల్యూఎస్ పర్యవేక్షక ఇంజనీర్ జి.విజయ భాస్కర్, అన్ని విభాగాల కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# కార్పొరేషన్ లీగల్ అడ్వైజర్‌గా సీనియర్ న్యాయవాది రంగారావు నియామకం

## కమీషనర్ నందన్ ఉత్తర్వులు



**నెల్లూరు లీగల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ న్యాయ సలహాదారుగా సీనియర్ న్యాయవాది వి.రంగారావు నియమిస్తూ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వైఓ నందన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పదవీకాలంలో న్యాయ సలహాదారుగా చార్జి తీసుకున్నప్పటి నుంచి మూడేళ్లపాటు కొనసాగుతారు. గతంలో నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ న్యాయ సలహాదారుగా కొనసాగుతూ లోక్ అదాలత్‌లో మున్సిపల్ కార్పొరేషన్ తరఫున కేసులు వేసి ఇంటి పన్ను, ప్లాను తదితర పన్నులు దాదాపు మూడు కోట్ల 70 లక్షల మేర పైకం మున్సిపాలిటీకి జమ కావడానికి కారణమయ్యారు. ఈయన సేవలను గుర్తించిన మున్సిపల్ కౌన్సిల్ సీనియర్ న్యాయవాది వి.రంగారావుని తిరిగి మున్సిపల్ కార్పొరే షన్ న్యాయసలహాదారుగా నియమించాలని తీర్మానం చేశారు. మున్సి పల్ కార్పొరేషన్ కమిటీ తీర్మానం మేరకు వీరిని న్యాయ సలహాదారుగా మరో మూడేళ్ల పాటు కొనసాగేలా నియమిస్తూ.. మున్సిపల్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. న్యాయవాదులకు సంబంధించి వివిధ రకాల సమస్యలను మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సొంత సమస్యగా భావించి వారికి స్వచ్ఛందంగా సహాయం చేసే న్యాయవాది రంగారావు ను తిరిగి నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ న్యాయ సలహాదారుగా నియమించటం పట్ల పలువు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ప్రతిష్టాత్మకంగా స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర



(మొదటి పేజీ తరువాయి)

కార్యక్రమానికి నడుం కట్టింది. వీధులను శుభ్రం చేసి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కృషి చేసింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతి 3వ శనివారం పర్యావరణ పరిరక్షణ కోసం ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న 'స్వర్ణాంధ్ర స్వచ్ఛ..ఆంధ్రా కార్యక్రమం'లో భాగంగా రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఆదేశాలతో 3వ శనివారం నెల్లూరు సిటీ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో క్లస్టర్ ఇంచార్జీల ఆధ్వర్యంలో టీడీపీ నేతలు స్వర్ణాంధ్ర -స్వచ్చాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. పారిశుధ్య కార్మికులతో కలిసి పిచ్చిమొక్కలు, చెత్త, వ్యర్థాలను తొలగించడం, పరిసరాల శుభ్రత, పర్యావరణ పరిరక్షణ చర్యలు చేపట్టారు. ఆరోగ్యకర జీవన విధానం, పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని ప్రజల్లో అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెలా 3వ శనివారం నిర్వహిస్తున్న స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఎలక్ట్రానిక్, ప్లాస్టిక్ వ్యర్థాలను మున్సిపాలిటీ వారికి అప్పగించాలని సూచించారు. పరిశుభ్రత చోటు చేసుకున్న ప్రాంతాల్లో ఆహ్లాదకర వాతావరణం కల్పిస్తే ఆ ప్రదేశంలో చెత్త వేసేందుకు ఎవరికీ మనస్సు రాదన్నారు. రోజువారీ అవసరాల కోసం ప్లాస్టిక్ కవర్ల స్థానంలో కాటన్ బ్యాగులు ఉపయోగించాలని కోరారు. 16వ డివిజన్‌లో క్లస్టర్ ఇంచార్జ్, కార్పొరేటర్ శ్రీకాంత్‌రెడ్డి, ప్రెసిడెంట్ సాయి కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్ళపాక అనూరాధ పాల్గొన్నారు. సైడు కాలువల్లో పూడిక తీసి, వీధులను శుభ్రం చేశారు. నిత్యం ప్రజాసేవ చేసే పారిశుధ్య కార్మికులను సన్మానించి, అల్పాహారం అందించారు. ఈ సందర్భంగా అనూరాధ మాట్లాడుతూ.. రోడ్లపై వ్యర్థాలు వేయరాదని, చెత్త కనిపిస్తే డస్ట్ బిన్‌లో వేయాలని ప్రజలను కోరారు. స్వచ్ఛ కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించడం ద్వారా జిల్లా శుభ్రంగా ఉంటుందన్నారు. ప్రజలకు పరిశుభ్రమైన గాలి, నీరు అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని చెప్పారు. ప్రజలు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో స్వచ్ఛ దివస్ కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపడతామన్నారు. స్వచ్ఛత కోసం ప్రతి పౌరుడు కలిసి రావాలని, ప్రతి ఒక్కరూ వ్యక్తిగతంగా శుభ్రతపై ప్రత్యేక దృష్టి సాధించాలని, జిల్లాను స్వచ్ఛ నెల్లూరుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జులు, కార్పొరేటర్లు, డివిజన్ ప్రెసిడెంట్లు, పాల్గొన్నారు.



# విద్యార్థి దశలోనే క్రమశిక్షణను అలవర్చుకోవాలి : ఎమ్మెల్యే కావ్య

**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో శాంతినగర్‌లో శ్రీ చైతన్య పాఠశాలలో శనివారం అఖిలభారత విద్యార్థి పరిషత్ నెల్లూరు విభాగం ఆధ్వర్యంలో అభ్యాస వర్గ కార్యక్రమాన్ని వారు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థి దశలో నాయకత్వ లక్షణాలు పోరాట తత్వం క్రమశిక్షణ అలవర్చుకోవడం ఎంతైనా అవసరమని తెలిపారు. విద్యార్థి సంఘాలు దేశ భవిష్యత్తును తీర్చిదిద్దరంలో కీలకపాత్ర వహిస్తారని తెలిపారు. కళాశాలలో చదువుతున్నప్పుడు నేను విద్యార్థి సంఘాల్లో చురుగ్గా పనిచేశానని అదే అనుభవం నన్ను నేటి స్థాయికి తీసుకొచ్చిందని తెలిపారు. ఏబీవీపీ అంటే క్రమశిక్షణకు మరో పేరుని ఈ సమస్త విద్యార్థుల్లో క్రమశిక్షణతో పాటు సమాజ సమస్యలపై అవగాహన కలిగేలా పనిచేస్తుందని తెలిపారు. తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చల ఉన్నత స్థాయికి ఎదగాలని తెలిపారు.




సాంప్రదాయాల పట్ల గౌరవాన్ని పెంపొందించడానికి వేదికలుగా నిలుస్తాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పోతుగంటి అలేఖ్య నాయకులు భరత్ విద్యార్థులు పాల్గొన్నారు.

# పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డలకు ఆరోగ్యం : సీడీపీఓ



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** పౌష్టికాహారంతోనే తల్లీ, బిడ్డల ఆరోగ్యం సక్రమంగా ఉంటుందని, రక్తహీనతకు గురికాకుండా పరిరక్షించబడతారని ఆత్మకూరు ఐసిడిఎస్ సిడిపివో పి.సునీలత పేర్కొన్నారు. పోషణ్‌మా కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని కరటంపాడు పంచాయతీ కార్యాలయం వద్ద ప్రత్యేక అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఐసిడిఎస్ జిల్లా ప్రాజెక్ట్‌డైరెక్టర్ బి.హేనాసుజన్ ఆదేశాలతో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ జి.కస్తూరి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో అతిథిగా పాల్గొన్న సిడిపివో సునీలత ప్రసంగిస్తూ పిల్లలు, కౌమారదశలో ఉన్న బాలికలు, గర్భిణీలు, బాలింతలకు పోషకాహార అవసరాలను గురించి ఆమె వివరించారు. తగిన పోషకాహారం అందించడం ద్వారా పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. పిల్లల ఆరోగ్య విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి ఆమె వివరించారు. పోషణమాసం అవగాహనా కార్యక్రమాన్ని అన్ని సచివాలయాల్లో, పంచాయతీల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించాల్సి ఉందన్నారు. స్వస్తనారీ, స్వశక్తిపరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పోషకాహార ప్రదర్శన ఏర్పాటు చేయగా పరిశీలించిన సిడిపివో పాల్గొన్న మహిళలకు చూపించి వివరించారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు తగిన పోషకవిలువల ఆహారాన్ని, కోడిగ్రుడ్లు, బాలామృతం, పాలు తదితరాలను అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్నామని, వాటిని అందరూ సక్రమంగా వినియోగించుకోవాలని, దాంతోపాటు తమకు అందుబాటులో ఉన్న పోషకవిలువల ఆకుకూరలు, కూరగాయలు, అపరాలు తదితరాలను కూడా తీసుకోవాలని సునీలత కోరారు. తల్లీ,బిడ్డ ఆరోగ్యవతంగా ఉండేందుకు తప్పకుండా పోషకవిలువల ఆహారాన్ని తీసుకోవాలని, రక్తహీనతకు గురికాకుండా ఉండగలరని సునీలత పేర్కొన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న గార్లపాటి ఫౌండేషన్ డైరెక్టర్, అనేక సామాజికసేవా కార్యక్రమాలు నిర్వహించే మాజీ ఉపమండలాధ్యక్షుడు, మాజీ సర్పంచ్ గార్లపాటి వేణుగోపాల్‌నాయుడు ప్రసంగిస్తూ అందరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, అందుకుగాను తగినంతగా అందరూ పౌష్టికాహారం తీసుకోవాలని కోరారు. అతిథులుగా పాల్గొన్న రాష్ట్ర తెలుగుదేశం కార్యదర్శి దావా పెంచలరావు, సర్పంచ్ పూనుగుంట రేవతిలు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ జి.కస్తూరి పౌష్టికాహారం ఆవశ్యకత, అంగన్‌వాడీ కేంద్రాలద్వారా లభించే పౌష్టికాహారం గురించి వివరించారు. అనంతరం సిడిపివో సునీలత పలువురు మహిళలకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు.అంగన్‌వాడీ కార్యకర్తలు టి.శారత, పి.నిర్మలాకుమారి, సురేఖ, సామ్రాజ్యం, మౌనిక, లావణ్య, నిశ్శి, పలువురు గర్భిణీలు, బాలింతలు, మహిళలు, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, చిన్నారులు, కిశోరబాలికలు తదితరులు పాల్గొన్నారు.

# అంటువ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి : ఆరోగ్య సిబ్బంది

**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** వర్షాకాలంలో అంటువ్యాధులు, దోమకాటు వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య, ఆరోగ్య సహాయకురాలు ఎం.రాధాకుమారి సూచించారు. పొదలకూరు పట్టణంలోని విఘ్నేశ్వరపురం కాలనీలో శనివారం సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కాలనీలో ప్రతి గృహాన్ని సందర్శించి ప్రజలందరికీ సీజనల్ వ్యాదులు, అంటువ్యాధులు ప్రబలకుండా టైఫాయిడ్ జ్వరాలు, వాంతులు విరోచనాలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని, శుభ్రమైన వేడి వేడి ఆహారాన్ని భుజించాలని ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది. ఇంటిపరిసరాలల్లో ఉన్నటువంటి పనికిరాని సీసాలు, ప్లాస్టిక్ గ్లాసులు పాత పాత్రలల్లో, కొబ్బరి బోండాలు, పాత టైర్లు, తొట్టెల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించాలని సూచించారు. అలాగే పూలకుండీలలో వారం రోజులకు మించి నిలువ ఉన్న నీటిని పారబోసి తాజాగా నీటిని నింపుకోవాలని తెలియజేశారు. వారం రోజులకు మించి నీరు నిలువ ఉన్నచో దోమలు గుడ్లు పెట్టి తద్వారా



దోమకాటు వ్యాధులైనటువంటి మలేరియా, చికెన్ గున్యా, డెంగ్యూ, మెదడు వాపు లాంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చేవకాశం ఉందన్నారు. ఈ దోమకాటు వ్యాధులు రాకుండా ఉండేందుకు ప్రజలందరూ ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి సుమాంజలి, ఆశా కార్యకర్తలు సీత, ఉష, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## రెడ్‌క్రాస్‌లో రక్తదానం, విరాళం ప్రకటన



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి మండల ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షులు, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం కమిటీ సభ్యులు, గాదం శెట్టి మధుసూదన్ పుట్టినరోజు సందర్భంగా రెడ్‌క్రాస్ రక్తకేంద్రంలో తన మిత్రులతో కలసి రక్తదానంతోపాటు రెడ్‌క్రాస్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల నిమిత్తం ఒక లక్ష రూపాయలు విరాళం ప్రకటించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సభ్యులు మధుసూదనరావును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్ జి.నందకిశోర్, వేమా నరేంద్రబాబు, చలువాది సత్యనారాయణ, మంచికంటి మురళీ, బైసాని నరసింహారావు, రెడ్‌క్రాస్ బాధ్యులు డి.రవిప్రకాష్, కె.హరినారప రెడ్డి, ఆరికట్ల మధుసూదనరావు, కలికి శ్రీహరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బిజేపీ నేత మహాలక్ష్మికు ఘన సన్మానం

● శుభాకాంక్షలు తెలిపిన పలువురు నేతలు



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** శ్రీ ఇరుకలల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ఆలయ కమిటీ సభ్యురాలుగా మిడతల మహాలక్ష్మి దంపతులను స్థానికులు, బంధువులు బిజెపి నేతలు సన్మానించారు. ఈ కార్యక్రమంలో విహెచ్‌పీ నేతలు ఏవిఆర్ మోహన్ రావు, ఏవి రాజేంద్ర, మిద్దె శ్రీనివాసులు, శశి కుమార్ హిందూ చైతన్య వేదిక నాయకులు మహేష్ నాగ శ్రీనివాసులు, రంగరాజన్, కాకు మురళి రెడ్డి, బిజెపి నేతలు వంశీధర్ రెడ్డి, రాజేశ్వరమ్మ, పొట్లూరు శ్రీనివాసులు, బైరి శ్రీనివాసులు, గడ్డం విజయకుమార్, మొగరాల సురేష్, అల్లూరు నాగేంద్ర సింగ్, పనిరాజు, సృజన, ఆదినారాయణ, కాసా శ్రీనివాసులు, నాగలక్ష్మి. పద్మ, శ్రావ్య, నీలి చెట్టి లక్ష్మణరావు. రఘురామయ్య, నారాయణయాదవ్, ప్రభాకర్, గంగుల జనార్ధన్, పలనాటి సూర్యనారాయణ, బీసీ సంక్షేమ సంఘం నేతలు సమాది శ్రీనివాసులు, పలమాల శ్రీహరి, గంగుల మధుసూదన్ రావు బుధవారపు బాలాజీ, నక్క గోపాల్‌లతోపాటు స్థానిక మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. శ్రీ రంగనాథ భక్తమండలి సభ్యులు మెంటా రామ మోహన్ రావు మిడతల దంపతులను వస్త్ర కిరీటాలతో సత్కరించారు.

## డిజిటల్ యాప్‌పై అవగాహన




**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరులోని ఆరవ గ్రామ సంఘం పరిధిలోని సుజాతనగర్ కాలనీలో డిజిటల్ యాప్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సంఘబంధ అధ్యక్షురాలు షేక్ బిబి జాన్ ఎస్కే ఈషా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ గూడా నర్సారెడ్డి సిసి జి సునీత హాజరయ్యారు. సుజాతనగర్ కాలనీలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీసీ సునీత మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం శ్రీ ప్రస్తుతం ఈ పథకం ద్వారా దరఖాస్తు చేసుకోవాలని షేర్ఫు సీఈవో ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో పొదుపు సభ్యులకు మన డబ్బులు మన లెక్కలు స్త్రీనిధి రికవరీ యాప్‌పై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. స్త్రీ నిధి వివరాల కోసం ఏఐ బేస్డ్ సూపర్ యాప్ను రూపొందించడం జరిగిందని తెలిపారు. వాయిస్ మెసేజ్ రూపంలో సభ్యులకు సమాచారం చరవాణి ద్వారా అందుతుందని తెలిపారు. మహిళా సాధికారిక కోసం తీసుకొచ్చిన డ్వాక్రా సంఘాలు సమర్థవంతంగా పనిచేయాలని లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివో ఏలు సంఘ బంధ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలు, ఎంపికలు.



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రం హైస్కూల్ నందు శనివారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలు, ఎంపికలు మండల స్థాయిలో జరిగినాయి. విద్యాశాఖ ఎంఈఓ మధుసూదన్ ప్రారంభించారు. మొదటి రోజు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలు ఎంపికలు జరిగినాయి. ప్రభుత్వ, ప్రైవేటు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ప్రక్రియ గురించి ఎంఈఓ మాట్లాడారు. విద్యార్థులు చదువుకుంటూనే క్రీడల్లో భాగస్వామ్యం కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు హేమ సుందర్, పీఈటీలు సుకుమార్, రాంబాబు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# అంబరాన్నంటిన ఎమ్మెల్యే కాకర్ల పుట్టినరోజు వేడుకలు

## అడుగడుగునా శుభాకాంక్షలు తెలిపిన అభిమానులు, నాయకులు, అధికారులు, ప్రజలు



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** ప్రజా హృదయ నేత, ప్రజా సేవకుడు, మన సున్న మారాజు, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ జన్మదిన వేడుకలు శుక్ర వారం అంబరాన్ని అంటాయి. ఉదయగిరిలో ప్రజాసేవకై ఉదయించిన సూర్యుడు, త్యాగశీలి, అన్నదాత, ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కి నియోజకవర్గ వ్యాప్తంగా వాడవాడలా జన్మదిన వేడుకలను నిర్వహించి, శుభాకాంక్షలు తెలియజేశారు. నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల్లో కూటమి నాయకత్వంలో, భారీ కేక్‌లు కట్ చేసి, ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చేస్తున్న సేవలను కొనియాడారు. స్వీట్లు పండ్లు పంచిపెట్టారు. సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పేదలకు దుప్పట్లు, విద్యార్థులకు ప్లేట్లు, అందజేశారు. హిందూ, ముస్లిం, క్రిస్టియన్ సోదరులు, దేవాలయాలు, మసీద్, చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అసెంబ్లీ శీతాకాలం సమావేశాలలో ఉన్నఎమ్మెల్యే కాకర్ల సురేష్, ఉదయాన్నే అమరావతిలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు, యువ నాయకుడు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వద్దకు వెళ్లి, శుభాకాంక్షలు అందుకొని, వారి వద్ద ఆశీస్సులు అందుకున్నారు. అసెంబ్లీ సమావేశాలలో స్పీకర్ రఘురామకృష్ణం రాజు, మంత్రులు ఎమ్మెల్యేలు సభా వేదికగా, శుభాకాంక్షలు తెలియజేశారు. అభిమానుల కోరిక మేరకు, వింజమూరులోని తెలుగుదేశం ప్రధాన పార్టీ కార్యాలయంలో హిందు, ముస్లిం, క్రిస్టియన్ మతపెద్దల ఆశీర్వచనాల అనంతరం కుటుంబ సభ్యులు, నాయకులు, అభిమానుల కోలాహలం నడుమ ఉదయగిరి నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి వివరాలతో తయారుచేసిన భారీ కేక్‌ను కట్ చేశారు. కేక్‌ను అభిమానులు, కుటుంబ సభ్యులు, ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కి తినిపించారు. పార్టీ కార్యాలయం అభిమానుల నినాదాలతో హోరెత్తింది. భారీ ఎత్తున బాణాసంచాలు కాల్చారు. అభిమాన నాయకున్ని గజమాలతో, పూల మాలలతో, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం అభిమానులు, నాయకులు, ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్, తల్లిదండ్రులు, కాకర్ల వెంకట సుబ్బానాయుడు, మస్తానమ్మ, సోదరుడు, కాకర్ల సునీల్, మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ పొన్నుబోయిన చంచల బాబు యాదవ్, జనసేన నియోజకవర్గ కోఆర్డినేటర్ కొట్టే వెంకటేశ్వర్లు, నియోజకవర్గ బిజెపి ఇంచార్జ్ కదిరి రంగారావు, తెలుగుదేశంపార్టీ నాయకులు మాలేపాటి చైతన్య, వింజమూరు మండల కన్వీనర్ గూడా నరసారెడ్డి, 8మండలాల టిడిపి మండల కన్వీనర్లు, ముఖ్య నాయకులు, బిజెపి జనసేన నాయకులు, జడ్పిటిసిలు, ఎంపీటీసీలు, సర్పంచులు, సొసైటీ చైర్మన్లు, డైరెక్టర్లు, మండల కమిటీ, గ్రామ కమిటీ నాయకులు, మహిళలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆమంచర్లలో స్వస్థ నారి-సశక్తపరివార్ అభియాన్



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ మండలంలోని సౌత్ మోపూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆమంచర్ల గ్రామంలో వైద్యాధికారి డాక్టర్ పి.రవీంద్రనాథ్ రెడ్డి, డాక్టర్ యూసఫ్ ఆధ్వర్యంలో వైద్య, ఆరోగ్య సిబ్బందితో కలిసి, మహిళల సంపూర్ణ ఆరోగ్యం కొరకు స్వస్థ నారి-సశక్తపరివార్ అభియాన్' (ఆరోగ్యవంతమైన మహిళ- శక్తి వంతమైన కుటుంబం) ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళల ఆరోగ్యంపై అవగాహన పెంచడం, మహిళలకు సమయానుకూల వైద్య సేవలు అందించడం, పోషకాహార పదార్థాలతో కూడిన ఆహారాన్ని తీసుకునే విధంగా ప్రోత్సహించడం, మహిళలను స్వశక్తివంతం చేయడం ద్వారా వారు తమ జీవనోపాధికి శక్తివంతంగా కృషిచేసి, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకునేందుకు దోహదపడుతుంది. ఈ ప్రత్యేక వైద్య శిబిరంలో మహిళలకు గుండె వ్యాధులు, మధుమేహం, రక్తపోటు, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్‌లను పరీక్షల ద్వారా గుర్తించి, రెఫరల్ సేవలు అందించడం, కన్ను, చెవి, ముక్కు, గొంతు, దంతాలు సంబంధించిన పరీక్షలు చేసి చికిత్సలు ఇవ్వడం, మహిళలు, కిషోర్ బాలికలకు రక్తహీనతకు సంబంధించిన పరీక్షలు నిర్వహించి, రక్తహీనతతో ఉన్నవారికి చికిత్సలు నిర్వహించడం, గర్భిణీలు, బాలింతలు కు గర్భవతిగా ఉన్నప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి, కాన్పు అయిన తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, అర్హులైన పిల్లలకు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం, ఎంసీపీ కార్డులు, పోషకాహారం గురించి అంగన్ వాడి కార్యకర్తలు వండిన వంటలు డిస్ప్లే చేసి, సమతుల్య ఆహారం గురించి, కిషోర్ బాలికలకు పీరియడ్స్ వచ్చే కాలంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి, సికిల్ సెల్ అనీమియా, క్షయ వ్యాధి నిర్మూలన, మానసిక ఆరోగ్యం గురించి, బ్లడ్ డొనేషన్, అవయవదానం గురించి అవగాహన, ఆయుష్మాన్ భారత్, పిఎంజెఏవై, వయో వందన కార్డులు శిబిరానికి వచ్చిన మహిళలకు ఇవ్వడం, ఏబిహెచ్ఏ ఐడీలు లేని వారికి శిబిరంలో ఏబిహెచ్ఏ ఐడిలు క్రియేట్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, బహుళ ఆరోగ్య విస్తరణాధికారి బి.పెంచలయ్య, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బట్టేపాటి అశోక్, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎఫ్‌డిపి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మీ ఫ్లాట్ల భవిష్యత్తు మీ చేతుల్లోనే



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు లేని ప్లాట్లు కొనుగోలు చేసి రిజిస్టర్ చేయించుకున్న వారు వారి ప్లాట్లను ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా రెగ్యులరైజేషన్ చేసుకునేందుకు అవకాశం కల్పించిందని ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని ఎంపీడీవో కే.శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. వింజమూరు మండల పరిధిలో 25 లేఔట్లు వేశారని వాటిలో రెండింటికి మాత్రమేనుడా అనుమతులు ఉన్నాయని అనుమతులు లేని వాటిని అనధికారిక లేఅవుట్లుగానే గుర్తించడం జరుగుతుందన్నారు. అలాంటి లేఔట్‌లో ప్లాట్లు కొన్నవారికి, యజమానులకు అవకాశం కల్పిస్తూ ఎల్‌ఆర్‌ఎస్ ప్రణాళికను తీసుకొచ్చిందన్నారు 26 జూలై నుండి ఈ పథకం కింద దరఖాస్తు చేసుకున్న వారికి రాయితీ ఉంటుందని తెలిపారు. అలాగే ఈ పథకం అక్టోబర్ 21 వరకు మాత్రమే అమల్లో ఉంటుందని ఆలోగా అనుమతులకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అనుమతులు పొందని యెడల ప్లాట్లు కొన్నవారు గృహ నిర్మాణానికి పంచాయతీ అనుమతి వాటర్ పైపులైన్లకు విద్యుత్ సరఫరాకు మరే ఇతర ప్రభుత్వ పథకాలు పొందేందుకు కూడా ఇబ్బందులు పడాల్సిన అవసరం ఉంటుందన్నారు. కొన్నిట్లో పంచాయతీ అనుమతులు లేకుండానే విద్యుత్తు సరఫరా కూడా తీసుకున్నట్లు గుర్తించామన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ పథకం ద్వారా దరఖాస్తు చేసుకొని యెడల అలాంటి లేఅవుట్లను అనధికారిక లేఅవుట్ల కింద గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందన్నారు ఎల్‌ఆర్‌ఎస్ ప్రణాళిక ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ఇంటి నిర్మాణానికి అనుమతులు పొందవచ్చని గృహ రుణాలు పొందేందుకు వీలుగా ఉంటుందన్నారు. అలాగే లేఔట్లలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్డి, కార్యదర్శి కే రామారావు కార్యాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# సీతారెడ్డి తోపు సాగు లబ్ధిదారులు ఆందోళన



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని సీతారెడ్డి తోపు సాగు లబ్ధిదారులు శనివారం తహసిల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఉపాధ్యక్షుడు నక్కా రాదయ్య నేతృత్వం వహించారు. ఆముదాలపాడు రెవెన్యూ పరిధిలోని వివిధ సర్వే నెంబర్లలో 83 ఎకరాలకు సంబంధించి సాగు లబ్ధిదారులకు వ్యవసాయ భూమి మంజూరు పత్రాలు ప్రభుత్వం అందజేసిందని గుర్తు చేస్తూ1-బీ అడంగల్ నందు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. సిపిఎం పార్టీ మద్దతు తెలిపింది. జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు నక్క మాట్లాడారు. వ్యవసాయ భూమి మంజూరు పత్రాలు ఆధారంగా చేసుకుని ఖాతా నెంబర్ వేయాలని ఆయన డిమాండ్ చేశారు. తద్వారా పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయాలన్నారు. అదేవిధంగా సాగు చేస్తున్న వారి వద్ద నుంచి రెవిన్యూ శాఖ శిస్తు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ఉపాధ్యక్షులు కోరారు. అనంతరం రెవెన్యూ శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# డిగ్రీ కళాశాలలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛభారత్



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి జవహర్ భారతి డిగ్రీ కళాశాలలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి నెల మూడవ శనివారం జరిగే స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం అధ్యాపకులు అధ్యాపకతిరా సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు కళాశాల ఆవరణంలో సమావేశమై స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. గ్రీన్ ఏపీ దింపు సంబంధించిన నినాదాలు చేశారు. కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపల్ వసుంధర దేవి మాట్లాడుతూ.. మొక్కలు పెంచడం వలన ప్రకృతి అంతా హరితం గాను కాలుష్యం లేకుండా మంచి వాతావరణాన్ని ఇస్తుందని అంతేకాకుండా సకల జీవరాశులకు అవసరమైన ప్రాణవైవు అందిస్తుందని పర్యావరణ సమతుల్యతను పెంపొందించుకోవచ్చని తెలిపారు. కావలి ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్ అరుణ వారి సౌజన్యంతో కళాశాల ఆవులు వివిధ రకాల మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో స్వయం ఉపాధి కోర్స్ డైరెక్టర్ ఆర్.మల్యాద్రి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి అధ్యాపక అధ్యాపక సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దొడ్ల వినయ్ కుమార్ రెడ్డి జవహర్ భారతి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ సుధాకర్ రెడ్డి ఈ కార్యక్రమం నిర్వహించిన అందుకు అభినందనలు తెలిపారు.

# విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పరిశీలన



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు సకాలంలో సిలబస్ పూర్తి చేయాలని ఎంఈవో-1 టీ.వెంకటేశ్వర్లు సూచించారు. శనివారం మండలంలోని లింగాంనేనిపల్లి ప్రాథమిక, పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రగతిని పరిశీలించి ఉపాధ్యాయులకు తగు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం సంబంధిత రిజిస్టర్లు పరిశీలించి మధ్యాహ్న భోజనా కొన్ని రుచి చూసి ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం భోజనం వడ్డించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయులు ఉపాధ్యాయిని తదితరులు పాల్గొన్నారు.

# పోలీసుల ఆధ్వర్యంలో స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం





**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** ప్రతి నెల మూడో శనివారం పర్యావరణ పరిరక్షణ కోసం, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా నేడు' వృక్ష సంపద పెంచడం ద్వారా హరిత పర్యావరణాన్ని ప్రోత్సహించండి' అనే అంశంపై నెల్లూరు జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) సిహెచ్ సౌజన్య ఆధ్వర్యంలో శనివారం జిల్లా పోలీసు కార్యాలయం నందు మొక్కలు నాటి, అనంతరం జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి, ప్రతిజ్ఞ చేయించి, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల వద్ద 'స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర'లో భాగంగా సుమారు 500పైగా మొక్కలు నాటి స్వచ్ఛత, శుభ్రత కార్యక్రమాలు చేపట్టి, స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ.. భావితరాల వారికి మనం అందించే ఆస్తే ఈ గాలి, ఆహ్లాదకరమైన వాతావరణం, తద్వారా కరువు కాటకాలు దూరమవుతాయని తెలియజేశారు. ప్రపంచవ్యాప్తంగా అడవులను పెంచడం వలన కరువు కాటకాలు రాకుండా ప్రపంచం మనుగడతోపాటు ప్రకృతి వైపరీత్యాలను నుండి కాపాడుకోగలమని వివరించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైన ఉందని, అంతేకాకుండా ప్రతి ఒక్కరూ కనీసం 10 మొక్కలను నాటాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆమె పోలీస్ అధికారులు, సిబ్బందితో కలిసి మొక్కలను నాటి వాటి పరిరక్షణ కొరకు బాధ్యతలు తీసుకుంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ చంద్రమోహన్, ఎస్బీ టు సీఐ శ్రీనివాస్ రెడ్డి, ఆర్ఐ వెల్ఫేర్ రాజారావు, ఆర్ఐ ఎన్‌టి శ్రీహరిబాబు, దర్గామిట్ట సిఐ రోశయ్య, ఆర్ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# కార్మిక చట్టాలను కాలరాస్తోన్న బీజేపీ : సీఐటీయు



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తూ దేశంలోని కార్మిక చట్టాలను కాలరాస్తోందని సిఐటియు జిల్లా కార్యదర్శి పూలగట్ల సురేష్ ఆరోపించారు. పొదలకూరు సిపిఎం కార్యాలయంలో శనివారం స్థానిక సిఐటియు ఎనిమిదవ మహాసభ నిర్వహించారు. ఈ మహాసభలో కార్మికులను ఉద్దేశించి సిఐటియు జిల్లా కార్యదర్శి కోలగట్ల సురేష్ మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి దేశంలో ఉన్నటువంటి కార్మిక వర్గాన్ని పెట్టుబడిదారులకు బానిసలుగా తయారు చేస్తోందని విమర్శించారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలు, నాలుగు లేబర్ కోడ్‌గా మార్చి కార్మికులకు ఎటువంటి హక్కులు లేకుండా పెట్టుబడిదారులకు ఊడిగం చేసే విధంగా కార్మిక చట్టాలను తయారు చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి వ్యతిరేకంగా కార్మిక సంఘాలన్నీ వ్యతిరేకించినప్పటికీ బీజేపీ ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తూ దేశంలో కార్మిక చట్టాలను కాలరాస్తోందన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం రూ.26,000లు ఇవ్వాలని, కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని, స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో కార్మిక వర్గాన్ని సంఘటితం చేసి హక్కుల కోసం అలుపెరగని పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. అనంతరం పొదలకూరు మండల సిఐటియు నూతన కమిటీని 17 మందితో ఎన్నుకోవడం జరిగింది. ఈ కమిటీలో కన్వీనర్ గా నిప్పట్లపల్లి గౌరయ్య, కో కన్వీనర్‌గా పంచాయతీ శ్రీనివాసులు, 15 మంది కమిటీ సభ్యులతో నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగింది. కాగా సిఐటియు ఆల్ ఇండియా మహాసభలను జయప్రదం చేయడానికి కార్మిక వర్గం అంతా కూడా సంఘటితంగా ఉండి పనిచేయాలని పిలుపునిచ్చారు.

## నిర్ణీత సమయంలో పూర్తి చేయండి : జడ్పీ చైర్ పర్సన్



**నెల్లూరు కార్పోరేషన్, మేజర్‌న్యూస్ :** జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ నెల్లూరు డిఎల్‌డిఓ కార్యాలయం పనులను శనివారం పర్యవేశక్షించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ.. అక్టోబరు మాసంలో ప్రారంభం కావలసిన నెల్లూరు జిల్లాలోని 5 డిఎల్‌డిఓ కార్యాలయం ఏర్పాటు చేయుటకు ఒక్కొక్క డివిజన్ కార్యాలయం ఏర్పాటుకు, మరమ్మత్తులకు షుమారు రూ.6లక్షలు, కార్యాలయపు ఫర్నిచర్ కొరకు రూ.2లక్షలు, కంప్యూటర్లు, ఇతర పరికరాల కొరకు రూ.2లక్షలు, ఒక్కొక్క డివిజన్ కార్యాలయంకు సుమారు రూ.10లక్షలు వంతున జిల్లా ప్రజా పరిషత్ నిధుల నుండి మంజూరు చేశారు. అందులో భాగంగా, నెల్లూరు డిఎల్‌డిఓ కార్యాలయం పనులను పర్యవేక్షించిన ఆనం అరుణమ్మ మంజూరు చేసిన పనిని నాణ్యత ప్రమాణాలతో, నిర్ణీత సమయంలో పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్దం చేయాలని ముఖ్య కార్యనిర్వహణాధికారిని, సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ సీఈఓ జె.మోహన్ రావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## మైపాడు బీచ్‌లో శుభ్రతా కార్యక్రమం



**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** అంతర్జాతీయ కోస్టల్ క్లీనప్ డే 2025 సందర్భంగా విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ), నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ (ఎన్ఐఓటీ) సంయుక్తంగా మైపాడు బీచ్‌లో తీర పరిశుభ్రతా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత మాట్లాడుతూ.. తీరప్రాంతాల పరిశుభ్రత పర్యావరణ పరిరక్షణలో కీలకమని, విద్యార్థుల భాగస్వామ్యం సమాజానికి ఆదర్శమని తెలిపారు. ఎన్ఐఓటీ శాస్త్రవేత్తలు డాక్టర్ జి.దేవిరామ్, డాక్టర్ సచ్చిత నందన్ సముద్ర జీవవ్యవస్థ రక్షణతో పాటు పర్యాటక అభివృద్ధికి బీచ్ పరిశుభ్రత ఎంతో అవసరమని వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సిహెచ్ విజయ మాట్లాడుతూ.. విద్యార్థులు సేవాకార్యక్రమాల్లో ముందుండి పాల్గొనడం విశేషమని అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు బీచ్‌లో చెత్తను తొలగించారు. స్వచ్ఛత ప్రతిజ్ఞ చేసి, తీరప్రాంత పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించారు.

## 9వ వార్డులో మొక్కలు నాటే కార్యక్రమం



**కావలి, మేజర్‌న్యూస్ :** స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా కావలి మున్సిపల్ కమిషనర్ జి.శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో కావలి రాజీవ్ నగర్ తొమ్మిదో వార్డ్ పార్కు నందు శనివారం సిబ్బంది, వార్డు ప్రజలతో కలిసి పార్కు నందు మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రజలు తమ చుట్టుపక్కల పరిసర ప్రాంతాల్లో శుభ్రంగా ఉంచుకొని స్వచ్ఛత బిస్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని విధిగా పాటించాలని రాబో తరం వారికి మనం మార్గదర్శకంగా ఉండి ఆరోగ్యంగా ఉండాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, కావలి మున్సిపల్ మేనేజర్ శానీటరీ ఇన్‌స్పెక్టర్ సానిటరీ సెక్రెటరీ, సచివాలయ సెక్రెటరీ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే జన్మదిన వేడుకలలో మొక్కల పంపిణీ

▸ 'ప్రతి ఇంటా ఒక చెట్టు- పచ్చదనమే భవిష్యత్తు' : ఎమ్మెల్యే



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** ఎమ్మెల్యే కాకర్ల సురేష్ జన్మదినాన్ని పురస్కరించుకొని, తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయంలో కలిగిరి మండల పరికోట సర్పంచ్ పర్వతరెడ్డి వాసుదేవరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వయంగా మొక్కలను మహిళా నాయకులు, పార్టీ కార్యకర్తలు, ప్రజలకు అందజేశారు. జన్మదిన వేడుకలను పచ్చదనంతో మేళవిస్తూ, పర్యావరణ పరిరక్షణకు తాము కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే ఈ సందర్భంగా స్పష్టం చేశారు. 'ప్రతి ఇంటా ఒక చెట్టు-ప్రతి మనిషి కర్తవ్యంగా భావించాలి' అంటూ పచ్చదనమే భవిష్యత్తు అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, మహిళా ప్రతినిధులు, కార్యకర్తలు, ప్రజలు ఉత్సాహంగా పాల్గొని ఎమ్మెల్యేకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రతిజ్ఞ చేయడం కాదు.. ఆచరణ ముఖ్యం

● హోమియోవైద్యులు కరుణాకర్



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** స్వచ్ఛాంధ్ర, స్వస్త్ నారి ససక్త్ నారి పరివార్ కార్యక్రమాలను లేగుంటపాడులోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నందు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా అక్కడి స్టాఫ్, ప్రజలతో స్వచ్ఛాంధ్ర, ససక్త్ నారిపరివార్ ప్రతిజ్ఞలను డాక్టర్ వి.కరుణాకర్ చేయించారు. ప్రతిజ్ఞ చేయడం కాదు.. అందరం ఆచరించినప్పుడే ఇలాంటి కార్యక్రమాల ప్రతిఫలాలు అందరికీ అందడమే కాకుండా మనం, మనతోటివారు, సమాజంలో అందరూ బాగుండడమే కాదు అభివృద్ధికి ముందడుగులు. ప్రకృతిని మనం పచ్చగా చేస్తే అది మనల్ని ఆరోగ్యంగా ఉంచుతుందని పిలుపునిస్తూ అక్కడకు వచ్చినవారందరికి ఆరోగ్య పరీక్షలు చేసి తగిన మందులు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇనమడుగు వైద్యులు డాక్టర్ నిరంజన్, ఎంఎన్‌ఓ రామక్రీష్ణ, ఆశ, 104 శిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆటలు, క్రీడలు బహుళ ప్రయోజనకరం : ఎంఈఓ






**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** విద్యార్థులకు ఆటలు, క్రీడలు బహుళ ప్రయోజనకరమని విక్రమసింహపురి విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ కనుమూరు సునీత పేర్కొన్నారు. ఆత్మకూరులోని డాక్టర్ ఎస్ఆర్‌జె డిగ్రీ కాలేజి ఆధ్వర్యంలో శ్రీధర్‌గార్డెన్స్ కళ్యాణమండపంలో శనివారం విశ్వ విద్యాలయ పరిధిలోని అంతర్‌కళాశాలల క్రీడా పోటీలను ఆమె ప్రారంభిం చారు. ప్రారంభసభలో ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యతోపాటు ఆట లు, క్రీడలపట్ల కూడా ఆసక్తి చూపాలని, తద్వారా ఆరోగ్యం, దేహదారుఢ్యం, మానసికప్రశాంతత, మానసికోల్లాసం లభిస్తాయని, విద్య, ఉద్యోగాల్లో ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. ఆటలు, క్రీడల్లో విద్యార్థులు ఆసక్తి చూపాలని, తర్ఫీదు పొందాలని ఆమె సూచించారు. ఆటలు, క్రీడలను ప్రభు త్వం ఎంతగానో ప్రోత్సహిస్తుందన్నారు. ఆత్మకూరులోని ఎస్ఆర్‌జె డిగ్రీ కాలేజిలో ప్రతిఏటా క్రమం తప్పకుండా వివిధ స్థాయి పోటీలను నిర్వహి స్తుండడం అభినందనీయమన్నారు. కాలేజి ప్రిన్సిపాల్ జి.వరకుమారి ఆధ్వ ర్యంలో ఈపోటీలను నిర్వహించగా ఆర్గనైజర్‌గా కాలేజి పి.డి సిరిమామిళ్ళ వెంకటేశ్వర్లు వ్యవహరించారు. రిజిస్ట్రార్ సునీత క్రీడాకారులను పరిచయం చేసుకొని అందరి బెస్ట్‌విషెస్ చెప్పి పోటీలను ప్రారంభించారు. క్రీడాకారుల కు ప్రిన్సిపాల్ వరకుమారి, పి.డి సిరిమామిళ్ళ వెంకటేశ్వర్లు అవసరమైన అన్నీ ఏర్పాట్లుగావించి ఎలాంటి అసౌకర్యం లేకుండా పర్యవేక్షించారు. కబడ్డి, చెస్, టగ్‌ఆఫ్‌వార్ పోటీలను నిర్వహించారు. కబడ్డి పోటీల్లో డాక్టర్ ఎస్ఆర్‌జె డిగ్రీకాలేజి జట్టు, జెనెక్స్‌కాలేజి జట్టు ఫైనల్స్‌కు చేరాయి. టగ్‌ఆఫ్‌వార్‌లో జెనెక్స్‌కాలేజి జట్టు విన్నర్స్‌గా, జవహర్‌భారతి కాలేజిజట్టు రన్నర్స్‌గా నిలిచాయి. ఈకార్యక్రమంలో ఎస్ఆర్‌జె డిగ్రీకాలేజి ప్రిన్సిపాల్ జి.వరకుమారి, వైస్‌ప్రిన్సిపాల్ టి.శ్రీనివాసులురెడ్డి, యూనివర్శిటి స్పోర్ట్స్‌బోర్డ్ సెక్రటరి డాక్టర్ వెంకట్రాయులు, యూనివర్శిటి పరిశీలకులు డాక్టర్ పి.ప్రసాద్‌రెడ్డి, పిడిలు అమ్మాజీ, రవీంద్రబాబు, కోచ్‌లు, మేనేజర్లు, క్రాడాకారులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

# జ్వాలాముఖిఅమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని ఉత్తరబలిజవీధిలో వెలసియున్న శ్రీశ్రీశ్రీ జ్వాలాముఖిఅమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలకు అన్నీ సిద్ధం చేశారు. ఆలయాన్ని సర్వాంగసుందరంగా అలంకరించారు. శని వారం ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఆలయ కమిటీ ప్రతినిధు లు, ఇతర ప్రముఖులు కరపత్రాలను ఆవిష్కరించారు. అశేషభక్తుల ఆదరణ పొంది నిత్యధూదీపనైవేద్యాలతో అలరారుతున్న శ్రీశ్రీశ్రీ జ్వాలాముఖి అమ్మవారి ఆలయంలో ప్రతిఏటా దశరా పర్వదినోత్సవాల సందర్భంగా శరన్నవరాత్రి ఉత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో అమ్మవారికి రోజుకొక అలంకారంతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు. ఈదపా కూడా ఉత్స వాలకు అన్నీ ఏర్పాట్లు గావించారు. భక్తుల దర్శనానికి ఎలాంటి అసౌకర్యం లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు గావించారు. ఆత్మకూరు పట్టణ ఆరాధ్యదేవత, కోరినకోర్కెలు తీర్చే కల్పవల్లి జ్వాలాముఖి అమ్మవారి ఆలయంలో శరన్నవ రాత్రి ఉత్సవాలు ఈనెల 22వ తేదీ ఆరంభమవుతాయని, ఆలయ కలశ స్థాపన జరుగుతుందని, 29వతేదీ విశేషహోమాలు జరుగుతాయని, అక్టోబర్ 1వతేదీన హోమం, 2వ తేదీన గ్రామోత్సవం జరుగుతుందన్నారు. ప్రతిరోజూ ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. ఈనెల 22వ తేదీన అమ్మవారికి స్వర్ణకవచాలంకారం, 23వతేదీన శ్రీబాలత్రిపురసుందరీదేవి అలంకారం, 24న శ్రీమంగళగౌరీదేవి అలంకారం, 25న శ్రీగాయత్రీదేవి అలంకారం, 26న శ్రీఅన్నపూర్ణాదేవి అలంకారం, 27న శ్రీలలితాదేవి



అలంకారం, 28న శ్రీమహాలక్ష్మీదేవి అలంకారం, 29న శ్రీ సరస్వతీదేవి అలంకారం, 30న శ్రీదుర్గాదేవి అలంకారం, అక్టోబర్1వతేదీన శ్రీ మహి షాసురమర్ధిని అలంకారం, 2వతేదీన శ్రీరాజరాజేశ్వరిదేవి అలంకారంతో ఆలయ ప్రధానఅర్చకులు పి.శివకుమార్‌శర్మ ఆధ్వర్యంలో వైభవోపేతంగా జరుగుతాయని నిర్వాహకులు పేర్కొన్నారు. ఉత్సవాల్లో భక్తులు విరివిగా పాల్గొని, అమ్మవారిని సందర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని వారు కోరారు. కార్యక్రమంలో ఆలయభక్తమండలి ప్రతినిధులు, సీనియర్‌సిటిజన్స్ వి.కృష్ణారెడ్డి, ఐ.నారాయణ, వెలిశెట్టి నారాయణరావు, ఏ.గోవిందరెడ్డి, కె.వెంకటేశ్వర్లు, పి.అంకయ్య, పి.వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# పోషణ మాసం మహోత్సవాల కార్యక్రమం

**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు పరిధిలో సెప్టెంబర్ 17వ తేదీ నుండి అక్టోబర్ 16వ తేదీ వరకు 8వ రాష్ట్రీయ పోషణ మాసం మహోత్సవాల కార్యక్రమంలో భాగంగా నెలూ ్లరు అర్బన్, నెల్లూరు రూరల్ ప్రాజెక్టు పరిధిలోని శనివారం వెంగల్ రావు నగర్ సెక్టర్‌లో వెంగల్ రావు నగర్-4 అంగన్వాడి సెంటర్‌లో డాక్టర్ రేనా భారతి, ఐసిడిఎస్ సూపర్వైజర్ ఏ.రాజేశ్వరి ఆధ్వర్యంలో పోషణ మాసం మహోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. అలాగే గర్భవతు లకు, బాలింతలకు, చిన్న పిల్లలు తీసుకోవలసిన సమతుల్య ఆహారం, నూనె, ఉప్పు, చక్కెర విని యోగం తగ్గించాలని, తల్లిపాలు, చిన్నపిల్లలో స్థూల కాయం, బాల్య దశ, సంరక్షణ విద్య, మొదలైన వాటిపై అవగాహన నిర్వహించారు. అలాగే పిల్లలు తీసుకోవాల్సిన ఆహారం గురించి వివరించారు. అదేవిధంగా ఏపిఏఏఆర్ ఐడి నమోదు, ఏబిహెచ్ఏ ఐడి నమోదు చేయాం చారు. అలాగే బాల్య వివాహల గురించి, రక్త




హీనత గురించి వివరంగా వివరించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలతో కూడిన ఆహారం గురించి వివరించారు. అంగన్వాడీ కేంద్రంలో అందించే ఫుడ్, పాలు, గుడ్లు, బియ్యం, పప్పు, ఆయిల్, బాలామృతం గురించి వివరించారు. అలాగే వాటి యొక్క ఉపయోగం కూడా తల్లులకు వివరించారు.

ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం అమరావతి అంగన్వాడి టీచర్లు వి.జ్యోతి, ఎం.విజయలక్ష్మి, పి.సాయి రమ, డి.శారదాంబ, అంగన్వాడి హెల్పర్ బి.హరిత, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## పాక్షిక సూర్యగ్రహణం లేదు.. ఆందోళన వద్దు

**జ్యోతిష శిరోమణి డాక్టర్ జీవీబీ మురళీకృష్ణ**



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** పాక్షిక సూర్య గ్రహణం మనకులేదు, ఎవరు కూడా ఆందోళన చెందవలసిన అవసరం లేదు. నియమాలు ఎవరు కూడా పాటించవలసిన అవసరం లేదని జ్యోతిష శిరోమణి డాక్టర్ జీవీబీ మురళీకృష్ణ అన్నారు. శనివారం ఆయన సూర్య గ్రహణం విషయం పట్ల మేజర్ న్యూస్ తో మాట్లాడారు. భారతదేశంలో పాక్షిక సూర్యగ్రహణం లేదన్నారు. గ్రహణం ఈనెల 21వ తేదీన రాత్రి 10 గంటల 59 నిమిషాల 43 సెకండ్లకు ప్రారంభమై 22వ తేదీ వేకువ జామున మూడు గంటల 23 నిమిషాల 45 సెకండ్లకు ముగుస్తుందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని తెలుసుకోవాలని జ్యోతిష శిరోమణి అన్నారు.

## క్లస్టర్ సముదాయ సమావేశాలు విజ్ఞాన బాండాగారాలు



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉపాధ్యాయులకు నిర్వహించే క్లస్టర్ సముదా యాలు విజ్ఞానబాండా గారాలని ఎంఈఓ-2 తోట శ్రీనివాసులు పేర్కొ న్నారు. శనివారం ఆయన ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉదయగిరి నందు జరుగుతున్న ఉదయగిరి క్లస్టర్ సముదాయ సమావేశమును సందర్శిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజులలో క్లస్టర్ సముదాయ సమావేశాలు విజ్ఞాన భాండాగారాలుగా తయారవుతాయని ఉపాధ్యాయులు తమ బోధనా పద్ధతులలో కాస్ట్ నో కాస్ట్ బోధనోపకర ణాలు ఏ విధంగా తయారు చేయాలి, సులభరీతిలో విద్యార్థులకు ఉత్తేజ కరంగా ఉండే విధంగా ఎలా బోధించాలి తదితర విషయాలను అందరూ ఉపాధ్యాయులు ప్రధానోపాధ్యాయులు కలసి చర్చించుకోవడం వలన విద్యార్థులకు నాణ్యమైన విద్య, విలువలతో కూడిన విద్య అందించడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, జిల్లా పరిషత్‌ఉన్నత పాఠశాల ఉదయగిరి బీసీ ఉర్దూ ప్రధానోపాధ్యాయురాలు షేక్ నూర్జహాన్, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 22 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

**సంగం, మేజర్‌న్యూస్ :** సంగంలోని శ్రీ కామాక్షి దేవి సమేత సంగమేశ్వర స్వామి వారి దేవస్థానం దేవస్థానంలో 22వ తేదీ నుండి శరన్న శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతాయని ఈవో ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 22 నుంచి అక్టోబర్ 02 తేదీ వరకు 22 కాలచ స్థాపనతో ప్రారంభమై రెండో తేదీ గ్రామోత్సవంతో ముగియనుంది. దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయని తెలిపారు. కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనీ స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని కోరుకుంటున్నాము.

## గోపాల్ రెడ్డి పార్ధివ దేహానికి నివాళి : ఆనం



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, మాజీ కార్పొరేటర్ లేబూరు పరమేశ్వర్ రెడ్డి అన్న లేబూరు గోపాల్‌రెడ్డి శు క్రవారం స్వర్గస్తులైనారు, శనివారం నెల్లూరు రూరల్ నియో జకవర్గం కోడూరుపాడు లోని వారి నివాసం నందు లేబూరు గోపాల్‌రెడ్డి పార్ధివ దేహానికి వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి నివాళి అర్పించడం జరిగింది. అనంతరం వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు చెవిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, 1వ డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆలయ ఉత్సవ కమిటీ ఛైర్మన్‌గా ఏలూరు శిరీష

- ఉత్సవ కమిటీ వైస్ ఛైర్మన్‌గా గూడంశెట్టి దొరబాబు
- ఉత్సవ కమిటీ కార్యదర్శిగా బిరుదోలు చంటి

**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరులోని దుర్గామిట్టలో వేంచేసియున్న శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శనివారం 51వ శ్రీదేవి శరన్నవ రాత్రి ఉత్సవాలు సందర్భంగా ఉదయం 10 గంటలకు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ పరిచయ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా 10 మందితో కూడిన ఉత్సవ కమిటీని దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కమీషనరు, దేవదాయశాఖ వారు ఉత్తర్వులు మేరకు నియమించారు. వీరిలో ఉత్సవ కమిటీ ఛైర్మన్‌గా ఏలూరు శిరీషని, ఉత్సవ కమిటీ వైస్ ఛైర్మన్‌గా గూడంశెట్టి దొరబాబుని, ఉత్సవ కమిటీ కార్యదర్శిగా బిరుదోలు చంటి నియమితులు అయ్యారు. ఉత్సవ కమిటీ సభ్యులుగా గజరా నరేష్, దావులూరి జమున, మానికల నాగమణి, చీపన తేజ, రాపూరు రాధా కుమారి, నాటకరాణి చిన పెంచలయ్య, కల్లూరు వీర రాఘవేంద్ర ఉత్సవ సభ్యులుగా నియమించడం



జరిగింది. ఉత్సవ కమిటీ సభ్యులకు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి శాలువాలు, పూల మాలలతో సత్కరించారు. కార్యక్రమంలో కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, 28వ డివిజన్ కార్పొరేటర్ చెక్కా అహల్య, మాజీ మేయర్ భానుశ్రీ, రాజా నాయుడు ఆలయ సహాయ కమీషనరు, కార్యనిర్వహణాధికారి కోవూరు జనార్ధన్ రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు రఘురామమూర్తి, ఉపప్రధాన అర్చకులు, వేదపండితులు, ఆలయ సిబ్బంది పాల్గొనడం జరిగిందని సహాయ కమీషనరు, కార్యనిర్వహణాధికారి కోవూరు జనార్ధన్‌రెడ్డి తెలిపారు.

# పల్లెల్లో సీసీ రోడ్లు నిర్మాణం



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సీసీ రోడ్ల నిర్మాణం పండుగలా జరుగుతుందని మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ గూడా నర్సారెడ్డి పేర్కొన్నారు. శనివారం వింజమూరు పంచాయతీ పరిధిలోని వడ్డీ పాలెంలో ఐదు లక్షల రూపాయల వ్యయంతో సుమారు 135 మీటర్లుమేర సిసి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. వడ్డీ పాలెంలోని మెయిన్ రోడ్డు నుండి పోలేరమ్మ గుడి మీదుగా పాఠశాల ప్రహరీ వరకు అలాగే నేరేడుపల్లి రోడ్డు నుండి చల్లా పద్మ ఇంటి వరకు నిర్మాణం జరుగుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా గూడ నరసారెడ్డి మాట్లాడుతూ.. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ నియోజకవర్గంపై ప్రత్యేకమైన శ్రద్ధ చూపుతూ ప్రతి పల్లెను అందంగా తీర్చిదిద్దాలని సంకల్పంతో సీసీ రోడ్ల నిర్మాణం కు నిధులను పెద్ద ఎత్తున మంజూరు చేయించడం జరిగిందన్నారు. రానున్న మూడు సంవత్సరాలలో నియోజకవర్గంలో ప్రతి పల్లెలో సీసీ రోడ్డు నిర్మాణం చేయాలన్నది ఎమ్మెల్యే సంకల్పం అన్నారు. ప్రతి గ్రామంలో కనీసం మౌలిక వసతులు కల్పించడం కొరకు కోట్లాది రూపాయల నిధులను రాష్ట్ర ప్రభుత్వం నుండి మంజూరు చేయించుకుని పనులను చేపడుతున్నారు. ఇలాంటి యువ ఎమ్మెల్యే నాయకత్వంలో పార్టీ ముందుకెళ్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు మంచాల శ్రీనివాసులు నాయుడు, పిఆర్‌ఏఈ తిరుమలయ్య స్థానిక నాయకులు పల్లాపు అంకయ్య పల్లాపు అంజయ్య చిన్న పాలి అంకయ్య పల్లాపురామయ్య తదితరులు పాల్గొన్నారు.

# స్వస్త్ నారీ- సశక్త్ పరివార్ కార్యక్రమం నామమాత్రంగా నిర్వహణ

**వింజమూరు, మేజర్‌న్యూస్ :** గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు మహిళల ఆరోగ్యంగా ఉండాలనే సంకల్పంతో దేశ ప్రధాని నరేంద్ర మోడీ స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అనే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం నామమాత్రంగా మాత్రమే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు బిజెపి వింజమూరు మండల అధ్యక్షులు దేగ మధు యాదవ్ మండిపడ్డారు. వింజమూరు పంచాయతీ ఆవరణంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, వెలుగు సిబ్బంది, సచివాలయ సిబ్బంది మాత్రమే ఉండడం గమనార్హం. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోడీ, మహిళా ఆరోగ్యంగా ఉంటే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని నినాదంతో మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తే, వింజమూరులో మాత్రం ఈ కార్యక్రమానికి తూట్లు పొడుస్తున్నారని ఆయన మండిపడ్డారు. గర్భిణీ స్త్రీలు, బాలింతలు, కిశోర బాలికలు, వారి ఆరోగ్య పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించి, వారికి ముందస్తుగా స్క్రీనింగ్ టెస్ట్‌లు చేయించి తగు సలహాలు సూచనలు ఇవ్వాల్సిన వారే నామమాత్రంగా



నిర్వహించడం ఎంతవరకు సబబు అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మరోసారి ఇలా పునరావృతం అయితే జిల్లా అధికారులకు తెలియజేస్తామని ఆయన తెలిపారు.

# భక్తిశ్రద్ధలతో తహలీల్ ఫాతేహా



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన ఏఎస్ పేట లోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ హజరత్ ఖాజా నాయబ్ రసూల్ వారి 252వ ఉరుసు గంధ మహోత్సవాల్లో భాగంగా శనివారం తహలీల్ ఫాతేహా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఆదేశాల మేరకు వక్ఫ్ బోర్డు దర్గా ఈవో షేక్ మహమ్మద్ హుస్సేన్ ఆధ్వర్యంలో దర్గా సజ్జాదా నషీన్ షాగులాం నక్షబంద్ హఫీస్ పాషా తహలీల్ ఫాతేహ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ మేరకు పక్కీర్ల విన్యాసాలు ప్రత్యేకంగా సలాములు గావించారు అనంతరం హఫీస్ పాషా ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు అలాగే దర్గా లోపల ఉన్న కాజా నాయబ్ రసూల్ దొరసానమ్మల సమాధులపై గలేఫ్ వస్త్రాలు ఉంచి పూల దుప్పట్లు వేసి గంధాన్ని లేపనం చేశారు ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంగం సీర్కిల్ ఇన్‌స్పెక్టర్ వేమారెడ్డి, ఏఎస్పేట ఎస్ఐ ఏ. సైదులు ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తును నిర్వహించారు. అలాగే స్వామివారి జపమాలను ప్రదర్శించారు. భక్తులు పాల్గొని జపమాలను అధిక సంఖ్యలో తిలకించారు.

## ఏపీ జెన్‌కో గేటు వద్ద
# కార్మికులు ఆందోళన



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** ఏపీ జెన్కో ప్రధాన మెయిన్ గేటు వద్ద శనివారం కాంట్రాక్ట్ కార్మికులు ఆందోళన వ్యక్తం చేశారు. సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యతని, విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని డిప్యూటి ఎంపీడీవో షేక్ కరీముల్లా, ఎస్ఐ అల శ్రీనులు పేర్కొన్నారు. శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ పావులూరి సామ్రాజ్యంతో కలిసి విద్యార్థులచే అవగాహన ర్యాలీ చేపట్టి ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీదుల్లో చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు పడవేయకుండా పంచాయతీకి ప్రజలు సహకరించాలన్నారు. పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతన్నారు. అలాగే ఎంఆర్ జీఆర్ ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో కళాశాల అసోసియేట్ డీన్ జీ.కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించి మొక్కలు నాటారు. జలవనరుల శాఖ డీఈ చంద్రమౌళి ఆధ్వర్యంలో గండిపాళెం జలాశయం వద్ద ఉన్న ముళ్లచెట్లను తొలగించి జనరేటర్ గదిని శుభ్రం చేశారు. ఎంఆర్ఆర్ కనస్ట్రక్షన్ ఆధ్వర్యంలో 167-బీజీ జాతీయ రహదారిపై పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, ఆధ్యాపకులు, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 14 మంది పేకాటరాయుళ్లు అరెస్టు



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** నగర పరిధిలో ఓ లాడ్జిలో పేకాట ఆడుతున్న 14మంది పేకాటరాయులను చిన్నబజార్ పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. వారి దగ్గర నుంచి 2,20,110/-నగదును స్వాధీనం చేసుకుని వారిని చిన్న బజార్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

## ద్విచక్ర వాహనం చోరీ

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో మోటార్బైక్ చోరీకి గురైన సంఘటన శనివారం తెల్లవారుజామున చోటుచేసుకొంది. వివరాల మేరకు.. కాలనీకి చెందిన పిడుగు నాగార్జున తన ఇంటి ముందు హీరోహోండా గ్లామర్ బైక్‌ను ఫార్కింగ్ చేశాడు. ఉదయం చూసేసరికి బైక్ కనిపించలేదు. తన నివాసంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా పుటేజీ చోరీ ఘటన నమోదై ఉంది. ఈ విషయమై బాధితుడు పోలీస లకు ఫిర్యాదు చేశాడు.

## యువతి అదృశ్యంపై ఫిర్యాదు

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని పుల్లాయపల్లి గ్రామానికి చెందిన ఐశ్వర్య అనే యువతి ఈనెల 13వ తేదీ నుంచి కనిపించడం లేదని అన్న పెనుగొండ రామాంజనేయులు శనివారం ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## 23న ఆత్మకూరులో వైసీపీ విస్తృతస్థాయి సమావేశం

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఈనెల 23వతేదీన మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో వైసిపి విస్తృతస్థాయి సమావేశం జరుగుతుందని కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని శ్రీధర్‌గార్డెన్స్ కళ్యాణమండపంలో వైసిపి అధినేత వైఎస్‌జగన్మోహన్‌రెడ్డి ఆదేశాలమేరకు 23వతేదీ మధ్యాహ్నం 3.30గంటలకు సమావేశం జరుగుతుందన్నారు. 'బాబుష్యూరిటి-మోసం గ్యారంటి', 'రీకాలింగ్ చంద్రబాబు మ్యానిఫెస్టో' క్యూఆర్‌కోడ్ పోస్టర్ల ఆవిష్క రణ, అనంతరం కార్యకర్తల సమావేశం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి, జిల్లా వైసిపి అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, నెల్లూరు పార్లమెంట్ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి, పార్లమెంటరీ పార్టీ పరిశీలకులు జంకె వెంకట్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, మాజీ జెడ్పి చైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి తదితరులు పాల్గొంటారని వారు పేర్కొన్నారు. ఈకార్యక్రమానికి నియోజకవర్గంలోని పార్టీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, జెడ్పిటిసి సభ్యులు, ఎంపిటిసి సభ్యులు, సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, ఉపసర్పంచ్‌లు, మండల ఉపాధ్యక్షులు, వైసిపి ఇతర నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా ప్రతినిధులు, అభిమానులు తరలిరావాలని వారు కోరారు.

# పర్యావరణను పరిరక్షిద్దాం : కమిషనర్ నందన్

**నెల్లూరు కార్పోరేషన్, మేజర్‌న్యూస్ :** స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమాన్నినెల్లూరు సిటీ నియోజకవర్గంలోని 28 డివిజన్లలో టీడీపీ నేతలు ప్రతిష్టాత్మకంగా శనివారం నిర్వహించారు. గ్రీన్ ఆంధ్ర సాధనలో భాగంగా ప్రతీ డివిజన్ లో మొక్కలు నాటారు. ప్రతీనెల మూడో శనివారం ప్రభుత్వం నిర్వహించే స్వచ్ఛాంధ్ర –స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పురపాలక పట్టణాభివృద్ధిశాఖా మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ సూచనల మేరకు అన్ని డివిజన్లలో గ్రీన్ ఆంధ్రను ప్రతిష్టాత్మకంగా చేపట్టారు. 14వ డివిజన్ ఏసీ నగర్ మెయిన్ రోడ్డు ప్రాంతంలో మొక్కలు నాటే కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ పాల్గొన్నారు. స్థానిక ప్రజలందరితో గ్రీన్ ఆంధ్రప్రదేశ్ సాధన కోసం కమిషనర్ నందన్ స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రత పై ప్రజలందరూ అవగాహన పెంచుకోవాలని, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ తమ పరిధిలో మొక్కలను నాటి సంరక్షించాలని, మొక్కల పెంపకాన్ని ఆదర్శంగా చేపట్టాలని



సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కర్తం ప్రతాప్ రెడ్డి, వేనాటి శ్రీకాంత్ రెడ్డి, రాష్ట్ర వేర్ హౌస్ కార్పొరేషన్ డైరెక్టర్ కప్పిర శ్రీనివాసులు, గణేశం వెంకటేశ్వర్లు,సిటీ టీడీపీ మహిళా నాయకురాలు కప్పిర రేవతి ,టీడీపీ నేతలు నగరపాలక సంస్థలోని వివిధ విభాగాల అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రీన్ ఆత్మకూరు అందరి లక్ష్యంకావాలి





● మొక్కలు నాటాలి, పెంచాలి ● పర్యావరణాన్ని కాపాడాలి

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** గ్రీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా గ్రీన్ ఆత్మకూరు అందరి లక్ష్యంకావాలని, అందరూ విరివిగా మొక్కలు నాటాలని, వాటిని పెంచాలని, పర్యావరణాన్ని కాపాడాలని ఆత్మకూరు మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారం వెంకటరమణమ్మ, పట్టణ తెలుగుదేశం అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి తదితరులు పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పిలుపుమేరకు నెలలో ప్రతి 3వశనివారం ఎంతో ప్రతిష్టాత్మకంగా స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర(ఎస్ఏఎస్ఏ) కార్యక్రమం నిర్వహించాల్సి ఉండగా శనివారం ఆత్మకూరు మున్సిపాలిటీ కార్యలయంలో గ్రీన్‌ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, సిబ్బంది ప్రత్యేక అవగాహనా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆవరణలో విరివిగా మొక్కలు నాటారు. ఈసందర్భంగా వారంతా మాట్లాడుతూ ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని అన్ని వర్గాలవారు బాధ్యతాయుతంగా స్వచ్ఛందంగా మొక్కలు నాటాలని, వాటిని పెంచి పోషించాలని కోరారు. చెట్లు అధికంగా లేనందున వాతావరణ సమతుల్యత లేదని, పర్యావరణం దెబ్బతింటుందని, మొక్కలు అధికంగా నాటిపెంచితే పచ్చదనంగా ఉండడం, ఆహ్లాదభరితంగా ఉండడంతో పాటు వాతావరణసమతుల్యత ఏర్పడుతుందని, సకాలంలో వర్షాలు కురుస్తాయని, పర్యావరణం పరిరక్షించబడుతుందని వారు పేర్కొన్నారు. అవకాశం ఉన్నచోట్లంతా అందరూ తమవంతుగా మొక్కలు నాటి పెంచాలని వారు పిలుపునిచ్చారు. ఈఅంశాలగురించి వారు ర్యాలీద్వారా ్రజలకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ఇన్‌చార్జ్‌మున్సిపల్ కమీషనర్ డి.మాధవి, ఫారెస్ట్‌రేంజ్‌ఆఫీసర్ శేఖర్, మున్సిపల్ చైర్మెన్ గోపారం వెంకటరమణమ్మ, వైస్‌చైర్మెన్ షేక్ సర్దార్, మెప్మా ఏవో జి.మాధవి, సిబ్బంది, పట్టణ తెలుగుదేశం అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, తెలుగుదేశం నాయకులు పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు, కొప్పోలు చిన్నపురెడ్డి, సాగర్, మున్సిపల్ కౌన్సిలర్లు శివకోటారెడ్డి, గంధళ్ళ వేణు, ఫారెస్ట్‌సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# చిరు ఉద్యోగులను ఆదుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది : ఎమ్మెల్యే

**వింజమూరు, మేజర్‌న్యూస్ :** చిరు ఉద్యోగులను ఆదుకోవాల్సిన బాధ్యత అందరి పైన ఉందని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. శనివారం వింజమూరు పంచాయతీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్వస్త్ నారీ సశక్త్ పరివార్, స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర, 8వ రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పుట్టినరోజు సందర్భంగా స్వస్త్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. ఈనెల 17వ తేదీ నుండి అక్టోబర్ రెండో తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని నిర్విరామంగా నిర్వహిస్తారన్నారు. మహిళల ఆరోగ్యం సంరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని తెలిపారు. ప్రతి నెల మూడో శనివారం నిర్వహిస్తున్న స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తున్నామన్నారు. అదేవిధంగా ఎనిమిదవ రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమాన్ని ఐసిడిఎస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారన్నారు. పై కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. చిరు ఉద్యోగులు చాలీచాలని జీతాలతో జీవనం గడుపుతున్నారని, వారికి ప్రభుత్వ పథకాలు అందక ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయాన్ని మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకు వెళ్లినట్లు తెలిపారు. ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అనంతరం స్కానింగ్ రూమ్‌ను పరిశీలించారు. పంచాయతీ కార్మికులను ఎమ్మెల్యే కాకర్ల సురేష్ శాలువాలతో సన్మానించారు. అంతకుముందు ఎంపీడీవో



శ్రీనివాసులు రెడ్డి, డాక్టర్ మురళి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గూడా నరసారెడ్డి, జడ్పిటిసి సభ్యులు గణపం బాలకృష్ణారెడ్డి, సర్పంచ్ నల్లగొండ సృజన, పట్టణ అధ్యక్షులు కోడూరు నాగిరెడ్డి, సీనియర్ నాయకులు మంచాల శ్రీనివాసులు నాయుడు, ఏగినేని శ్రీనివాసులు నాయుడు, పంచాయతీ కార్యదర్శి, రామారావు, సొసైటీ డైరెక్టర్ గని శ్రీనివాసులు, కటకం ప్రసన్న కుమార్, జనసేన మండల కన్వీనర్ బండారు సత్యనారాయణ, బీజేపీ మండల కన్వీనర్ దేగా మధు యాదవ్, అంగన్వాడి కార్యకర్తలు, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

## వర్షపు నీరు రోడ్లపై నిలవ కుండా చూడండి



**నెల్లూరు కార్పోరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ పారిశుధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక జిఎన్‌టి రోడ్డు కె.వి.ఆర్ పెట్రోల్ స్టేషన్ కూడలి ప్రాంతంలో ఇంజనీరింగ్, శానిటేషన్ అధికారులతో కలిసి శనివారం పర్యటించారు. వర్షపు నీరు రోడ్లపై నిలిచిపోయి, ట్రాఫిక్ అంతరాయాలు, రోడ్డు ప్రమాదాలు జరగకుండా అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. డ్రైన్ కాలువలలో పూడికతీత పూర్తిస్థాయిలో చేపట్టి నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా పర్యవేక్షించాలన్నారు. అండర్ బ్రిడ్జి ప్రాంతాలలో వర్షపు నీరు నిలవకుండా మోటార్ల సహాయంతో ఎప్పటికప్పుడు నీటిని తోడివేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ భాగం ఎస్ఈ రామ్ మోహన్ రావు, ఏఈ ఫాజిల్, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జాయింట్ కలెక్టర్ కార్తీక్ బదిలీ



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ఐఏఎస్ బదిలీల్లో భాగంగా శనివారం జిల్లా జాయింట్ కలెక్టర్ కే.కార్తీక్ బదిలీ అయ్యారు. సంవత్సరం పాటు ,రెవెన్యూ సమస్యలపై తన వంతు సేవలు అందించారు. అయితే కొంతమంది ప్రజాప్రతినిధులు జాయింట్ కలెక్టర్ మధ్య సఖ్యత లేకపోవడంతో ఈ బదిలీ అనివార్యమైంది. ప్రస్తుతం జిల్లాకు మొగిలి వెంకటేశ్వర్లు ఐఏఎస్ నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా రానున్నారు. నెల్లూరు జిల్లా గతంలో నెల్లూరు జిల్లా పరిచయస్తుడైన వెంకటేశ్వర్లు 2014లో తహసిల్దారుగా ప్రస్థానం ప్రారంభించారు. అంచలంచెలుగా ఎదిగి ఇప్పుడు జిల్లాకు జాయింట్ కలెక్టర్‌గా రానున్నారు.

## టీచర్స్, వాలంటీర్లకు శిక్షణ కార్యక్రమం




**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో స్థానిక మున్సిపల్ ప్లాట్స్ పరిధిలో ఉన్న కోరిడ్ స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో శనివారం సంస్థలో పనిచేస్తున్న నిరుపేద గ్రామాలలో ఉన్న ఉపాధ్యాయులు, వాలంటీర్లు కు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గ్రామాలలో పేద విద్యార్థులకు ఏ విధంగా ఉపాధ్యాయులు విద్యను సులభమైన పద్ధతిలో బోధించాలో శిక్షణ ఇవ్వడం జరిగిందని తెలిపారు. అనంతరం గ్రామాలలో నీ వాలంటీర్స్‌కు ప్రతి కుటుంబం లోనే పెద్దలకు పిల్లల పట్ల శ్రద్ధ కలిగి విద్యార్థులను చదువుకోవడం కోసం ప్రతి ఒక్క తల్లిదండ్రులు ప్రోత్సాహకం కల్పించాలని, వాలంటీర్లు ప్రతి తల్లిదండ్రులతో మాట్లాడి వారికి అవగాహన కల్పించేందుకు ఈ శిక్షణ ద్వారా తెలియజేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం కోరిడ్ సమస్త డైరెక్టర్ ఆర్.జైపాల్ మాట్లాడుతూ.. కోరీడ్ సంస్థలు పనిచేయుచున్న నిరుపేద గ్రామాల్లోనే విద్యార్థులకు సాయంకాలం గ్రామీణ ప్రాంతంలో ఉచిత విద్యను అందించేందుకు సెంటర్స్‌ని ఏర్పాటు చేసి నైపుణ్యమైన ఉపాధ్యాయులచే సులభమైన పద్ధతుల్లో విద్యను అందించడమే ఈ సమస్య యొక్క ఈ సమస్త యొక్క ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోరిడ్ సంస్థ సూపర్వైజర్ దంతం సునీల్, కోరిడ్ సమస్త సిబ్బంది పాల్గొన్నారు.